సాక్షి
కర్నూలు
గురువారం : 26 : జూన్ : 2025



ఆగకుండా.. ఆటంకం లేకుండా..
కర్నూలులో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కొరత ఉంది. వాహనాలు నిలిచిపోతే సమస్య తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో కర్నూలు ట్రాఫిక్ వాట్సప్ నంబర్ అందుబాటులోకి రానుంది. 8లో▸



ఘనంగా 'మట్టెద్దు'ల పండుగ
జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలు భక్తిశ్రద్ధలతో మట్టెద్దుల పండుగను జరుపుకున్నారు. మట్టి ఎద్దులకు ప్రత్యేక పూజలు చేసి పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,616.72
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:52.436
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:24,600
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:197

ఎమ్మిగనూరు చేనేతకు భౌగోళిక తలపాగా!

- డాక్యుమెంటేషన్ కోసం రెసల్యూట్ బి2బి సంస్థ ఎంపిక
- నేడు ఎమ్మిగనూరు, పరిసర ప్రాంతాల్లో పర్యటన
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషితోనే గుర్తింపు



చేనేత మగ్గం ద్వారా పట్టుచీరలు తయారు చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మిగనూరు చేనేతకు భౌగోళిక గుర్తింపు వచ్చేందుకు మార్గం సుగమమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన కృషి ఫలితంగానే ఈ అవకాశం లభించింది. గత ప్రభుత్వం తీసుకున్న చొరవతో 2023–24 సంవత్సరానికి సంబంధించి ఒక జిల్లా– ఒక ఉత్పత్తి కింద కోడుమూరు పట్టు చీరలకు జాతీయ స్థాయిలో పురస్కారం లభించింది. నేడు ఎమ్మిగనూరు చేనేత కార్మికులు తయారు చేసే బెడ్‌షీట్లు, టువాళ్లకు భౌగోళిక గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డాక్యుమెంటేషన్ తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెసల్యూట్ బి2బి సంస్థను ఎంపిక చేసింది. ఈ సంస్థ ప్రతినిధులు ఈ నెల 26న ఎమ్మిగనూరు, పరిసర ప్రాంతాల్లో చేనేత బెడ్‌షీట్లు, టువాళ్ల తయారీని అధ్యయనం చేయనున్నారు. వీటి నాణ్యత ప్రమాణాలను కూడా పరిశీలిస్తారు.

స్వాతంత్ర్యానికి ముందే ...

చేనేత అంటే ఎవ్వరికైనా గుర్తుకు వచ్చేది ఎమ్మిగనూరు. ఎమ్మిగనూరును చేనేతపురిగా వ్యవహరిస్తారు. ఇక్కడ కార్మికులు అగ్గిపెట్టిలో పట్టే వస్త్రాలను సైతం తయారు చేయగలరు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితోనే 1938లో ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం ఏర్పాటైంది. పద్మశ్రీ అవార్డు గ్రహీత మాచాని సోమప్ప కరువు కాలంలో ఈ సంఘాన్ని ప్రారంభించారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన చేనేత వస్త్రాలను ధరించే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘాన్ని మురార్జీదేశాయ్ స్వయంగా వచ్చి పరిశీలించారు. ఇక్కడి వీవర్స్ కాలనీకి ఆయనే శంకుస్థాపన చేశారు. మాచాని సోమప్ప నాటి జవహర్‌లాల్ నెహ్రూతో గుంతకల్లులో సమావేశమై చేనేత వస్త్రాల ఉత్పత్తి, విశిష్టతను వివరించారు. ఈ సొసైటీకి ఇంటర్నేషనల్ అవార్డుతో పాటు పలు నగదు పురస్కారాలు లభించాయి.

జాతీయ స్థాయిలో గర్తింపు

నాణ్యత, హుందాతనానికి మారుపేరైన ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. అయితే భౌగోళిక గుర్తింపు లభించలేదు. జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్నప్పటికీ భౌగోళిక గుర్తింపు లేకపోవడం వల్ల వివిధ ప్రాంతాల్లో ఉత్పత్తి అయిన చేనేత వస్త్రాలతో పోటీపడలేని పరిస్థితి ఏర్పడింది. ఎమ్మిగనూరు వస్త్రాలకు చారిత్రాత్మక నేపథ్యం ఉండటంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఒక జిల్లా– ఒక ఉత్పత్తి కింద జాతీయ స్థాయి పురస్కారానికి అపురూపమైన ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలను ఎంపిక చేయడం విశేషం. ఎమ్మిగనూరు చేనేత వస్త్రాల మార్కెటింగ్‌కు కర్ణాటక, తెలంగాణ, ఏపీ తదితర ప్రాంతాల్లో 17 రీటైల్ అవుట్‌లెట్స్ ఉన్నాయి. చేనేత వస్త్రాలు ఇక్కడి నుంచి కాకపోయిన ఇతర ప్రాంతాల నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్నట్లు తెలుస్తోంది.

ఏటా రూ.6.50 కోట్ల టర్నోవర్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేనేతకు పుట్టినిల్లు ఎమ్మిగనూరు. ఒకవైపు ఎమ్మిగనూరు వీవర్ కో–ఆపరేటివ్ ప్రొడక్షన్ సేల్ సొసైటీ లిమిటెడ్, మరోవైపు మాస్టర్ వీవర్స్ ద్వారా ఎమ్మిగనూరుతో పాటు ఆదోని, గుడేకల్, నందవరం తదితర ప్రాంతాలకు విస్తరించింది. నేడు చేనేత పరిశ్రమపై 2వేల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం ద్వారా 250 కుటుంబాలు, మాస్టర్ వీవర్స్ ద్వారా 1,500 కుటుంబాలు రాణిస్తున్నాయి. ఏటా ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం రూ.1.50 కోట్ల టర్నోవర్ సాధిస్తుండగా మాస్టర్ వీవర్ల ద్వారా ఏటా రూ.5 కోట్ల వరకు టర్నోవర్ ఉండటం విశేషం. ఎమ్మిగనూరు యూనిట్‌గా ఏటా రూ.6.50 కోట్ల టర్నోవర్ ఉన్నట్లు స్పష్టమవుతోంది.



ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలు

వైఎస్సార్‌సీపీ హయాంలో 'వెలుగు'లు

పవర్‌లూమ్స్ వచ్చిన తర్వాత చేనేత పరిశ్రమ క్రమంగా మనుగడ కోల్పోయే స్థాయికి రావడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఊపిరి పోశారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేసి కార్మికులను ఆదుకున్నారు. చేనేత పరిశ్రమను ఆధునీకరించుకునేందుకు, పవర్ లూమ్ పోటీని తట్టుకునేందుకు అప్పటి ప్రభుత్వం నెలకు రూ.2వేల ప్రకారం ఏడాదికి రూ.24వేల ఆర్థిక సహాయాన్ని అందించింది. చేనేత పరిశ్రమ అభివృద్ధికి క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం ఇతోధికంగా తోడ్పడుతోంది. ఎమ్మిగనూరు క్లస్టర్ డెవలప్‌మెంటు కింద 250 మంది చేనేతకారులకు రూ.44.58 లక్షలతో అధునాతన పరికరాలు, పనిముట్లు పంపిణీ చేసింది. అధునాతన వస్త్రాల తయారీ కోసం ప్రత్యేకంగా డిజైనర్‌ను కూడా నియమించింది.

ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు భౌగోళిక గుర్తింపు వచ్చే అవకాశం



ఎమ్మిగనూరులో అన్ని రకాల చేనేత వస్త్రాలు తయారు అవుతున్నాయి. ఎమ్మిగనూరు బెడ్‌షీట్లు, టువాళ్లకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. తాజాగా ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘానికి భౌగోళిక గుర్తింపు లభించే అవకాశం ఉంది. రెసల్యాట్ బీ2బీ సంస్థ ప్రతినిధులు ఎమ్మిగనూరు, పరిసర ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఈ ప్రాంతాల్లో ఉత్పత్తి చేస్తున్న బెడ్‌షీట్లు, టువాళ్లకు భౌగోళిక గురింపు కోసం బీ2బీ సంస్థ అవసరమైన డాక్యుమెంటేషన్ సిద్ధం చేయనుంది.
–నాగరాజరావు, అసిస్టెంటు డైరెక్టర్, కర్నూలు

న్యూస్‌రీల్

పల్లెల్లో పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవు



చిన్నటేకూరులో ఇంటింటి చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీఓ జి.భాస్కర్

కర్నూలు(అర్బన్): వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తితే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ హెచ్చరించారు. పారిశుద్ధ్యం చాలా అధ్వానంగా ఉందని ఆస్పరి మండలం జోహరాపురం గ్రామం నుంచి ఐవీఆర్‌ఎస్‌కు ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలో ఈనెల 24న గ్రామాన్ని సందర్శించి తగిన చర్యలు చేపట్టామన్నారు. బుధవారం ఆయన కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజు ఇళ్ల నుంచి చెత్తను సేకరించి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. తొలకరి వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అలాగే తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

హాస్టళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించండి



మాట్లాడుతున్న డీబీసీడబ్ల్యూఈఓ కె.ప్రసూన

కర్నూలు(అర్బన్): జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై సంబంధిత వసతి గృహ సంక్షేమాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి కె.ప్రసూన కోరారు. బుధవారం స్థానిక బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో జిల్లాలోని హెచ్‌డబ్ల్యూఓలతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టళ్లు పునః ప్రారంభం కావడం, హెచ్‌డబ్ల్యూఓల బదిలీలు కూడా పూర్తయిన నేపథ్యంలో ఆయా హాస్టళ్లను అన్ని అంశాల్లో మెరుగుపర్చాలన్నారు. వసతి గృహ సంక్షేమాధికారుల కొరత నేపథ్యంలో దాదాపు ఒక్కో హెచ్‌డబ్ల్యూఓ అదనంగా మరో హాస్టల్‌కు ఇన్‌చార్జిగా ఉన్నారన్నాని, తమ పరిధిలోని రెండు హాస్టళ్లల్లో ఏ రోజు ఏ హాస్టల్‌లో ఉంటున్నారనే సమాచారాన్ని తప్పక సహాయ బీసీ సంక్షేమాధికారి నోటీసులో ఉంచాలన్నారు. సమావేశంలో సహాయ బీసీ సంక్షేమాధికారులు ఎం.శ్రీనివాసులు, ఆంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీజీసెట్ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: ఏపీ పీజీ సెట్–2025 ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్రంలోని 17 యూనివర్సిటీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు గత నెల 9 నుంచి 12వ తేదీ వరకు 10 సెషన్లలో 31 సబ్జెక్టులకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా కేంద్రంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. మొత్తం 1,770 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,490 మంది పరీక్ష హాజరయ్యారు. వీరిలో 1,294 మంది అర్హత సాధించారు. కర్నూలుకు చెందిన బి.అర్షిత ఎలక్ట్రానిక్స్ కోర్సులో ప్రథమ ర్యాంకును కైవసం చేసుకున్నారు.

ఆరు సంస్థలకు అనుమతి

కర్నూలు(సెంట్రల్): జువైనల్ జస్టిస్ చట్టం –2015 ప్రకారం అర్హత కలిగిన ఆరు బాలల సంరక్షణ సంస్థలకు నిర్వహణ అనుమతులు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బుధవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో జిల్లాస్థాయి సిఫార్సుల కమిటీ సమావేశంలో ఆరు బాలల సంరక్షణ సంస్థలకు అనుమతులు మంజూరు చేశారు. మొత్తం 9 సంస్థలు దరఖాస్తు చేసుకోగా నిబంధనల మేరకు లేని మూడు సంస్థల దరఖాస్తులను తిరస్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆర్‌టీఐ విభాగంలో పలువురికి పదవులు

కర్నూలు (టౌన్): జిల్లాలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్‌టీఐ విభాగంలో పలువురికి పదవులు దక్కాయి. పత్తికొండ, ఆదోని, మంత్రాలయం, పాణ్యం నియోజకవర్గాల్లో ఆర్‌టీఐ విభాగంలో పార్టీ నాయకులను నియమించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం రాత్రి నాలుగు నియోజకవర్గాల్లో ఆర్‌టీఐ విభాగంలో వివిధ హోదాల్లో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

హోదా	పేరు	నియోజకవర్గం
ఆర్‌టీఐ విభాగం ప్రధాన కార్యదర్శి	జి.వెంకటేశ్వర రెడ్డి	పత్తికొండ
ఆర్‌టీఐ విభాగం కార్యదర్శి	నులవాయి తిమ్మప్ప	ఆదోని
రాష్ట్ర ఆర్‌టీఐ విభాగం సంయుక్త కార్యదర్శి	ఆర్.నాగరాజు గౌడ్	మంత్రాలయం
రాష్ట్ర ఆర్‌టీఐ విభాగం సంయుక్త కార్యదర్శి	ఎన్.రంగప్ప	పాణ్యం

కలెక్టర్ అనుమతి వచ్చాక ఐఏబీ సమావేశం

కర్నూలు సిటీ: తుంగభద్ర డ్యాంలోకి ఆశాజనకంగా నీటి ప్రవాహం ఉండడంతో ఖరీఫ్ జిల్లా సాగు నీటి సలహా మండలి సమావేశం నిర్వహించేందుకు జల వనరుల శాఖ ఇంజనీర్లు కలెక్టర్ అనుమతి కోరారు. అక్కడి నుంచి అనుమతి వచ్చిన తరువాత సమావేశం నిర్వహించి తుంగభద్ర దిగువ కాలువకు నీటి విడుదల, ఎంత ఆయకట్టుకు నీరిస్తారో నిర్ణయించనున్నారు. టీబీ డ్యాం ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు ఆశజనకంగానే కురుస్తున్నాయి. ప్రస్తుతం డ్యాంకు 24 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 50 టీఎంసీలకుపైగా నీటి నిల్వలు చేరాయి. డ్యాంలో 41 టీఎంసీల నీరు చేరిన తరువాత ఆయకట్టుకు నీరు ఇస్తారు. అయితే ఈ ఏడాది డ్యాం 19వ గేటు ఏర్పాటు పనులు, బోర్డు పరిధిలోని ఎల్‌ఎల్‌సీ కాలువ లైనింగ్ పనులు పూర్తి కాకపోడవంతో నీటి విడుదలను సైతం కొంత ఆలస్యంగా విడుదల చేయలనుకుంటున్నారు. ఈ నెల 27వ తేదీ కర్ణాటక సాగు నీటి సలహా మండలి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో కర్ణాటక సాగు నీటి కాలువలకు నీటి విడుదలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఆ తరువాత ఏపీకి చెందిన జల వనరుల శాఖ నుంచి ఏపీ కాలువలకు ఎంత నీటిని విడుదల చేయాలని అనే అంశంపై ఇండెంట్ పెట్టనున్నారు.

టీబీ నివారణకు పటిష్ట చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు (సెంట్రల్): జిల్లాలో టీబీ (క్షయ) నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు నేషనల్ హెల్త్ మిషన్ అడిషనల్ సెక్రటరీ ఆరాధన పట్నాయక్‌కు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వివరించారు. బుధవారం సాయంత్రం ఆమె ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టీబీ ముక్త్ భారత్‌పై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. అందులో భాగంగా కర్నూలు జిల్లాలో టీబీ నివారణ చర్యలను కలెక్టర్ ఆమెకు వివరించారు. 2,500 మంది టీబీ వ్యాధి గ్రస్తులకు న్యూట్రిషన్ కిట్స్, మందులను అందజేస్తున్నట్లు వివరించారు.

వర్షాలు తేలికపాటికే పరిమితం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు తేలికపాటికే పరిమితం అవుతున్నాయి. ఆకాశం మేఘావృతం అవుతున్నప్పటికీ వర్షాలు మాత్రం నిరాశకు గురిచేస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం వరకు తేలికపాటి వర్షాలే కురిశాయి. ఆలూరులో ఒక మోస్తరుగా 11.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మంత్రాలయం, కర్నూలు రూరల్, దేవనకొండ, పత్తికొండ, వెల్దుర్తి, కర్నూలు అర్బన్ తదితర ప్రాంతాల్లో వానలు జల్లుల నుంచి తేలికపాటికి పరిమితం అయ్యాయి. ఈ కారణంగా సాగులో పురోగతి కరువైంది. గత ఏడాది ఇదే సమయానికి 50,731 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఈ సారి వర్షాలు దోబూచులాడుతుండటంతో 39,908 హెక్టార్లు మించని పరిస్థితి. ఒక రోజు లేదా రెండు, మూడు రోజుల్లో 75 మి.మీ వర్షం కురిసినప్పుడే నల్లరేగడి నేలల్లో విత్తనం వేసుకోవాలి. ఎర్ర నేలల్లో 50 మి.మీ వర్షపాతం నమోదైనప్పుడే విత్తనం వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

వృద్ధ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న జడ్జి లీలా వెంకటశేషాద్రి

నంద్యాల(వ్యవసాయం): అనారోగ్యంతో బాధపడుతున్న ఖైదీలకు, అలాగే 70 ఏళ్ల పైబడిన వృద్ధ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లీలా వెంకట శేషాద్రిలు తెలిపారు. నంద్యాలలోని జిల్లా ప్రత్యేక ఉపకారాగారాన్ని బుధవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో సమావేశం ఏర్పాటు చేశారు. లోక్ అదాలత్‌తో ఉచిత న్యాయం పొందవచ్చన్నారు. ఆన్‌లైన్ 15100 ద్వారా సేవలు అభ్యర్థించవచ్చని తెలిపారు. జైల్ సూపరింటెండెంట్ గురుప్రసాదరెడ్డి, న్యాయవాది నాయక్, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ పీఎస్‌లకు అత్యాధునిక ద్విచక్ర వాహనాలు



అత్యాధునిక ద్విచక్రవాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: ట్రాఫిక్ నియంత్రణకు అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన 22 ద్విచక్ర వాహనాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలోని కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు ఈ వాహనాలను కేటాయించనున్నారు. నాలుగు చక్రాల వాహనాల్లో వెళ్లలేని ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడినప్పుడు ఈ ద్విచక్ర వాహనాలపై అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో పోలీసు చీఫ్ కార్యాలయం నుంచి ఈ వాహనాలను జిల్లాకు కేటాయించారని ఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ సదరన్ రీజియన్ కమాండెంట్ మహేష్ కుమార్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు బాబుప్రసాద్, భాస్కర్ రావు, ప్రసాద్, సీఐలు తేజమూర్తి, మన్సూరుద్దీన్, నాగరాజ రావు, రామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ కె.వేణుగోపాల్

కర్నూలు(హాస్పిటల్): యువత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ కె.వేణుగోపాల్ సూచించారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ, సాంస్కృతిక పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 'సంవిధాన్ హత్య దివస్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ (అత్యవసర పరిస్థితి) 1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21వ తేది వరకు 21 నెలల పాటు కొనసాగిందన్నారు. అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితి విధించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో సంవిధాన్ హత్య దివస్‌గా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసిందని చెప్పారు. ఎమర్జెన్సీ సమయంలో ఎన్నో బాధలు అనుభవించిన వారిని స్మరించుకునే ఉద్దేశంతో, రాజ్యాంగ దుర్వినియోగానికి వ్యతిరేకంగా పోరాడిన వారందరికీ నివాళులర్పించేందుకు, ప్రజలకు భారత రాజ్యాంగ విశిష్టత తెలియపరిచే అవగాహన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లా సాంస్కృతిక పర్యాటక శాఖ అధికారి విజయ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి మాట్లాడుతూ.. ఎమర్జెన్సీతో అప్పటి ప్రధాని మంత్రి ఇందిరాగాంధీ తన ప్రాబల్యాన్ని కోల్పోవాల్సి వచ్చిందని చెప్పారు. ప్రధాన వక్త రమేష్ మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు మూడుసార్లు ఎమర్జెన్సీ విధించారని, అందులో రెండుసార్లు యుద్ధాల కారణంగా విధిస్తే 1975 జూన్ 25న ఇందిరాగాంధీ తెచ్చిన ఎమర్జెన్సీ చరిత్ర పుటలలో నిలిచిపోయిందన్నారు.

శ్రీశైలానికి పెరుగుతున్న వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: కృష్ణానది పరీవాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలానికి ఎగువన ఉన్న జూరాల, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి దిగువకు వరదనీరు ప్రవహిస్తోంది. మంగళవారం నుంచి బుధవారం వరకు 58,411 క్యూసెక్కుల వరదనీరు శ్రీశైలానికి వచ్చి చేరింది. డ్యాం పరిసర ప్రాంతాలలో 0.40 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 461 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో స్వల్పంగా 0.075 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 143 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. అలాగే బ్యాక్ వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 318 క్యూసెక్కుల నీటని విడుదల చేశారు. బుధవారం సాయంత్రం సమయానికి శ్రీశైలం డ్యాం నీటిమట్టం 860.20 అడుగులకు చేరుకోగా, జలాశయంలో 106.6764 టిఎంసీల నీరు నిల్వ ఉంది.

రాకపోక.. నరకయాతన

- కూలిన వంతెన
- మరమ్మతులు చేయని రాష్ట్ర ప్రభుత్వం



వంతెన కూలడంతో వాగు నీటిలోనే బైకులను తరలిస్తున్న దృశ్యం

కౌతాళం: కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత పల్లెలకు కర్ణాటక రాష్ట్రంలోని గ్రామాలతో సంబంధాలు తెగిపోయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కౌతాళం మండల పరిధిలోని కుంబళనూరు–గోతులదొడ్డి గ్రామాల మధ్య ఉన్న వాగు వద్ద ఉన్న వంతెన ఏప్రిల్ నెలలో కూలిపోయినా ఇప్పటి వరకు శాశ్వత మరమ్మతులు చేయలేదు. తాత్కాలికంగా చేసిన పనులు ఈనెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షానికి పూర్తిగా కొట్టుకుపోయాయి. దీంతో నదిచాగి, కుంబళనూరు క్యాంపు–1, క్యాంపు–2, కుంబళనూరు, మేళిగనూరు గ్రామాలతో పాటు కర్ణాటకలోని వివిధ గ్రామాల నుంచి హాల్వి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ సర్వీసులు కూడా నిలిచిపోవడంతో ఆయా గ్రామాల నుంచే వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాల్వి నుంచి కర్ణాటకలోని శిరుగుప్పకు వెళ్లేందుకు కూడా సౌకర్యాలు నిలిచిపోయాయి. వంతెన దెబ్బతిని రెండు నెలలు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. గోతులదొడ్డి, హాల్వి గ్రామాల రైతుల పొలాలకు కుంబళనూరు వైపు, కుంబళనూరు, క్యాంపు వాసుల పొలాలు హాల్వి, గోతులదొడ్డి వైపు ఉన్నాయి. బుధవారం అమావాస్య కావడంతో కర్ణాటకలోని మాన్వి, శిరుగుప్ప, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కర్ణాటకకు చెందిన ఒకరు రాత్రి కల్వర్టు గుర్తించక ద్విచక్ర వాహనంలో వచ్చి ఇక్కడ కింద పడి మృతి చెందాడు.

దారుణ పరిస్థితి



మా పొలాలు కుంబళనూరు ప్రాంతంలో ఉన్నాయి. నాది గొతులదొడ్డి గ్రామం. పొలం పనికి రావాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ఇంతటి దారుణ పరిస్థితి ఎప్పుడూ లేదు.
–వెంకటేష్

ప్రభుత్వం స్పందించాలి



ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం స్పందించాలి. పక్కన కర్ణాటకలో ఇలాంటి పరిస్థితి లేదు. అక్కడ వెంటనే స్పందించి మరమ్మతులు చేపడుతారు. ఇక్కడ చానా కష్టంగా ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలి.
–మహాదేవి

ప్రతిపాదనలు పంపాం

మరమ్మతుల కోసం రూ.40 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. తాత్కలిక పనులు చేయడానికి ఎవరూ కూడ ముందుకు రావడం లేదు.
–ఆర్‌అండ్‌బీ–ఏఈ సాయిసురేష్

క్లుప్తంగా

విద్యార్థిని చితకబాదిన పీడీ


పీడీ కొట్టిన దెబ్బలకు బాలుడి వీపుపై వాతలు తేలిన దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని వీవర్స్ కాలనీ జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థి సాయి అక్షయ్ అల్లరి చేశాడని ఫిజికల్ డైరెక్టర్ చితకబాదాడు. విద్యార్థి వీపుపై కొట్టడంతో వీపు ఎర్రగా కందిపోయింది. తలపై కొట్టడంతో గుడిపె కట్టింది. విద్యార్థి ఏడుస్తూ ఇంటికి వెళ్లటంతో తండ్రి నరేష్ అతన్ని వెంటబెట్టుకొని పాఠశాలకు వెళ్లి పీడీని ప్రశ్నించగా.. అల్లరి చేయడంతో కొట్టినట్లు నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నాడని తండ్రి నరేష్ విలేకరుల వద్ద వాపోయారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థిని బెత్తంతో కొట్టరాదనే నిబంధనలు ఉన్నా, ఇలా చితకబాదటం ఏమటని తండ్రి అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


పెద్దయ్య (ఫైల్)

మద్దికెర: గ్రామ శివారులోని మొలగవెల్లి రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గడ్డం పెద్దయ్య (40) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఉదయం మొలగవెల్లి రోడ్డులోని తన పొలంలో నిలిపిన జీవాలను చూసుకొని తిరిగి వస్తుండగా మద్దికెర నుంచి మొలగవెల్లికి వెళుతున్న కారు, స్కూటర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన పెద్దయ్యను చికిత్స కోసం గుంతకల్లుకు తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్‌నాయక్ కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.

లింగనిర్ధారిత వీర్య నాళిక ధర తగ్గింపు

● పూర్తి ధర రూ.300.. సబ్సిడీ రూ.150

కర్నూలు(అగ్రికల్చర్): ఆవులు, గేదెల్లో పెయ్య దూడలే పుట్టడం ద్వారా పాడిని అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన లింగనిర్ధారిత వీర్య నాళికల ధరలను ప్రభుత్వం తగ్గించింది. గతంలో ఒక డోసు వీర్య నాళికల పూర్తి ధర రూ.1300 ఉండగా.. సబ్సిడీ రూ.850 ఉండేది. రైతులు రూ.500 చెల్లించాల్సి వచ్చేది. మొదటి డోసుకు చూలు కట్టకపోతే రెండవ డోసు ఉచితంగా వేసేవారు. తాజాగా ఒక డోసు వీర్య నాళికల పూర్తి ధరను రూ.300కు తగ్గించి 50 శాతం సబ్సిడీ ఇచ్చే విధంగా పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంది. ఆవులు, గేదెలు ఎదకు వచ్చినపుడు రూ.150 చెల్లించి లింగనిర్ధారిత వీర్య నాళికలతో కృత్రిమ గర్భధారణ చేయించవచ్చు. మొదటి డోసుకు చూలు కట్టకపోతే రెండవ డోసు ఉచితంగా వేస్తారు. లింగ నిర్ధారిత వీర్య నాళికలతో కృత్రిమ గర్భధారణ చేయడం వల్ల 95 శాతం వరకు పెయ్య దూడలే పుడతాయని అధికారులు పేర్కొంటున్నారు.

మల్లన్న సేవలో మంచు విష్ణు


దర్శనం అనంతరం ఆలయం వద్ద సినీ హీరో మంచు విష్ణు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా, మల్లికార్జునస్వామి వార్లను సినీ హీరో మంచు విష్ణు బుధవారం దర్శించుకున్నారు. రాజగోపురం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంచు విష్ణు మల్లికార్జున స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం చేయగా, అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం మంచు విష్ణు మాట్లాడుతూ.. శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివారిని దర్శించుకోవడంతో 12 జ్యోతిర్లింగాల యాత్ర పూర్తయ్యిందని చెప్పారు. తాను నటించిన కన్నప్ప సినిమా ఈ నెల 27న రిలీజ్ అవుతుందని, ప్రేక్షకులందరూ ఆదరించాలని కోరారు.

ఆగకుండా.. ఆటంకం లేకుండా..!

- ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు కార్యాచరణ
- ప్రజల చేతిలో కర్నూలు ట్రాఫిక్ వాట్సాప్ నంబర్
- త్వరలో ప్రారంభించేందుకు పోలీసుల కసరత్తు



కర్నూలు: ట్రాఫిక్.. కర్నూలు నగరంలో ఇదో పరిష్కారం దొరకని సమస్య. సగటు జీవి సహనానికి పరీక్ష.. దీని పరిష్కారానికి కొన్నేళ్లుగా పోలీసు అధికారులు చేయని ప్రయత్నం.. ప్రయోగమంటూ లేదు. ప్రజలు, వాహనదారులే కాదు.. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఎదుర్కొంటున్న చికాకులు అన్నీ ఇన్నీ కావు. మళ్లీ ఇన్ని రోజులకు మరో కొత్త ఆలోచనతో పోలీసులు ముందుకొచ్చారు. ప్రజల చేతిలో కర్నూలు టాఫిక్ పేరుతో సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టనున్నారు.

అవస్థలు...

కర్నూలు మున్సిపాలిటీ స్థాయి నుంచి నగరపాలక సంస్థగా, కుడాగా రూపాంతరం చెందినప్పటికీ ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాలేదు. ఏడాదికేడాది వాహనాల సంఖ్య పెరగడం, రోడ్ల విస్తరణ లేకపోవడం, ఉన్నవి సైతం ఆక్రమణ వల్ల కుచించుకుపోవడం తదితర కారణాలతో నానాటికీ ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. దీనికి తోడు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఎక్కడైనా వాహనాలు జామ్ అయినా క్రమబద్ధీకరించేందుకు గంటలకొద్దీ సమయం పడుతోంది. వాహనాల నియంత్రణ, ఓవర్ లోడ్, రాంగ్ రూట్ ప్రయాణం, ఇతర ట్రాఫిక్ సమస్యల పరిష్కారంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తే బాగుంటుందని పోలీసులు ఆలోచించారు. ప్రజల చేతిలో కర్నూలు ట్రాఫిక్ వాట్సప్ నంబర్ అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. త్వరలో ట్రాఫిక్ వాట్సప్ నంబర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు.

ఫొటోలు తీసి గ్రూప్‌లో పోస్ట్ చేయాలి

కర్నూలు నగరం నలుదిక్కులా ఎక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తినా, వాహనాలు ఆగిపోయినా స్థానికులు ఫొటోలు తీసి వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేయాల్సి ఉంటుంది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితులను చక్కదిద్దుతారు. ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపటం, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం, సీటు బెల్టు లేకుండా కారు నడపటం వంటి ఉల్లంఘనలపై ఫొటోలు తీసి వాట్సప్‌లో పోస్ట్ చేయవచ్చు. అలాగే వాహనాల చిత్రాలు, వీడియోలు కూడా తీసి షేర్ చేయవచ్చు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఫొటోలు, వీడియోల రూపంలో వాట్సప్‌కు షేర్ చేస్తే పోలీసులు వాటిపై విచారణ జరిపి నిర్ధారించుకుని వారికి జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ట్రాఫిక్ అధికారులు వెల్లడించారు.

గతంలో ట్రాఫిక్ నియంత్రణ పేరుతో వెబ్‌సైట్

కర్నూలు నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం గతంలో ట్రాఫిక్ మిత్ర పేరుతో వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అయితే అప్పటి ఎస్పీ సిద్ధార్థ కౌశల్ బదిలీపై వెళ్లడంతో ట్రాఫిక్ మిత్ర కార్యక్రమం అటకెక్కింది. కర్నూలు నగరంలో సుమారు ఆరు లక్షలకు పైగా జనాభా ఉంది. రోజురోజుకూ కాలనీలు విస్తరిస్తున్నాయి. వాహనాల సంఖ్య కూడా పెరుగుతోంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రధాన రహదారుల్లో సుమారు 36 పాయింట్లు ఉన్నాయి. ట్రాఫిక్ స్టేషన్‌లో ప్రస్తుతం 60 మంది మాత్రమే సేవలుందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సిబ్బంది కొరత వేధిస్తున్న నేపథ్యంలో పౌరులను భాగస్వాములను చేసేందుకు పోలీస్ వాట్సప్ నంబర్‌ను అందుబాటులోకి తేనున్నారు.

నగర సమాచారం

- కర్నూలు నగర జనాభా సుమారు ఆరు లక్షలు
- ట్రాఫిక్ స్టేషన్‌కు అవసరమైన సిబ్బంది 100 మంది
- ప్రస్తుతమున్న సిబ్బంది 60 మంది
- నగరంలో ఉన్న ట్రాఫిక్ పాయింట్లు – 36
- ట్రాఫిక్ సిగ్నల్స్ – 13
- ద్విచక్ర వాహనాలు సుమారు 2 లక్షలు
- ఆటోలు 25 వేలకు పైగా
- కార్లు 50 వేలకు పైగా
- బస్సులు – 2 వేలు
- లారీలు, జీపులు – 2 లక్షలు
- ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలు, జిల్లాల నుంచి వచ్చి వెళ్లే అన్ని రకాల వాహనాలు సుమారు 2 లక్షలు

బీసీ హెచ్‌డబ్ల్యూఓస్ అసోసియేషన్ ఎన్నిక


జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రాజు


ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. బుధవారం స్థానిక బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా పెద్దకడుబూరు వసతి గృహ సంక్షేమాధికారి పాలెగార్ సత్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శిగా పత్తికొండ కళాశాల బాలుర వసతి గృహం సంక్షేమాధికారి పి.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.ప్రమీల, కోశాధికారిగా కనకలత, ఉపాధ్యక్షులుగా సీ.శంకర్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.గిరిజాదేవి, సంయుక్త కార్యదర్శులుగా నరసప్ప, హారతీదేవి, ఎల్లమ్మ, కార్యవర్గ సభ్యులుగా గోపాల్, బసవరాజు, ప్రసన్నబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా వసతి గృహ సంక్షేమాధికారులందరూ ఐకమత్యంగా విధులు నిర్వహించాలన్నారు. నూతన కార్యవర్గాన్ని సహచర వసతి గృహ సంక్షేమాధికారులు అభినందించారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆదోని సబ్‌కలెక్టర్, డీఈఓ

ఆదోని సెంట్రల్: పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సూచించారు. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు సరిపడా ఇవ్వడం లేదని ఫిర్యాదులు రావడంతో బుధవారం జిల్లా విద్యాధికారి శామ్యూల్‌పాల్, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణతో కలిసి పరిశీలించారు. భోజనం రుచికరంగా ఉంటుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం తగినంత పెడుతున్నారా? తక్కువగా పెడుతున్నారా అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు. మధ్యాహ్న భోజన పథకం రికార్డులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు తగినంత భోజనం వడ్డించాలన్నారు. రుచి, నాణ్యత లోపిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి, హెచ్‌ఎం ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

యాగంటి ఈఓగా పాండురంగారెడ్డి



కర్నూలు కల్చరల్: నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం యాగంటి ఉమా మహేశ్వర స్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ)గా డి.పాండురంగారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జ్యువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ (జేవీఓ)గా విధులు నిర్వహిస్తున్న పాండురంగారెడ్డికి యాగంటి దేవస్థానం ఈఓగా విధులు నిర్వహిస్తున్న గ్రేడ్–2 ఈఓ బి.చంద్రుడు స్థానంలో ఎఫ్ఏసీ ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ పోరాటంతోనే జీఆర్‌పీ టెండర్లు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ పోరాటంతోనే ప్రభుత్వం గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం (జీఆర్‌పీ) పనులకు టెండర్లు పిలిచినట్లు వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం లక్ష్మీనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టి సాగునీరు అందివ్వాలని కోరుతూ ఈ నెల 19న స్థానిక జీఆర్‌పీ కార్యాలయాన్ని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతులు ముట్టడించడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. ప్రాజెక్ట్ కింద ఎమ్మిగనూరు నియోజకవర్గంతో పాటు మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని ఎత్తిపోతల పథకం కింద 7 పనులను మొదలెట్టేందుకు ఈ నెల 21న టెండర్ ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. ఇందులో చిలకలడోన ఎత్తిపోతల పథకం -1కు రూ.16,75,250, రెండవ పథకానికి రూ.16,60,270, సోగనూరు పథకం -1కు రూ.16,68,360, రెండవ దానికి రూ.16,66,938, పూలచింత పథకం కింద ఒక పనికి రూ.16,68,360, రెండవ దానికి రూ.16,60,270 కేటాయించడం వివరించారు. జూలై 1న టెండర్లను ఓపెన్ చేసే అవకాశం ఉందని, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 6 నెలల్లో పనులను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి

గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం పనులను వేగంగా పూర్తి చేయాలని గడ్డం లక్ష్మీనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన బుధవారం పట్టణంలో జీఆర్‌పీ ఆయకట్టు రైతులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. టెండర్లు పొందిన కాంట్రాక్టర్లు ముందుగా ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లకు 15 రోజుల్లో మరమ్మతులు చేయాలన్నారు. మిగతా జీఆర్‌పీ పనులను అధికారులు వెంటనే పూర్తి చేయించి సాగునీరందించాలని కోరారు. సర్పంచ్‌లు నరసింహులు, కోటేశ్వరరావు, ప్రకాష్‌రెడ్డి, పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు చాంద్‌బాషా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శాంతిరాజు, చుక్కామల్లేష్, వెంకటేష్, గోవిందు, ప్రభాకర్, సోమన్న, శివ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'మట్టెద్దు'ల పండుగ


చిన్నహ్యాటలో మట్టెద్దులకు పూజలు చేస్తున్న దృశ్యం

హొళగుంద: కర్ణాటక సంప్రదాయాలను పుణికి పుచ్చుకున్న హొళగుంద మండల ప్రజలు బుధవారం మట్టెద్దుల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇక్కడి ప్రజలు ఏటా ఏరువాక పౌర్ణమి తర్వాత వచ్చే అమావాస్య రోజున మట్టితో ఎద్దుల ప్రతిమలను తయారుచేసి పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా బుధవారం ఆయా గ్రామాల ప్రజలు మట్టి ఎద్దులకు ప్రత్యేక పూజలు చేసి పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. చిన్నహ్యాట గ్రామంలో సాయంత్రం కోలాటం, నృత్యాలతో మట్టి ఎద్దుల ఊరేగించి వైభవంగా నిమజ్జనం చేశారు.

కదంబాల కనువిందు


మహానందిలో ఆకట్టుకుంటున్న కదంబ పుష్పాలు

మహానంది: బంతి వలె సుతిమెత్తగా, అందంగా కనిపించే కదంబ పుష్పాలు ప్రకృతి ప్రేమికులను, భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మహానంది క్షేత్ర పరిసరాల్లో కదంబ వృక్షాలకు పుష్పాలు విరగకాస్తున్నాయి. ఈ పుష్పాలు పార్వతీదేవి, లలితాదేవికి ఇష్టమైనవని పురాణాల్లో పేర్కొన్నారు. ఇంతటి ప్రాచుర్యం కలిగిన కదంబ పుష్పాలను చూసి భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులైతే ఎంత బాగున్నాయో అంటూ వాటి గురించి తెలుసుకుని మరీ ఇళ్లకు తీసుకెళ్తున్నారు.

ఏపీ ఏఐయూకేఎస్ అధ్యక్షుడిగా అర్లప్ప



నందికొట్కూరు: ఆంధ్రప్రదేశ్ అఖిలభారత ఐక్య రైతు సంఘం అధ్యక్షుడిగా వేల్పుల అర్లప్పను ఏకగ్రీవంగా ఎన్నుకునట్లు సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. జంగారెడ్డి గూడెంలో రోటరీ క్లబ్‌లో జరిగిన అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రథమ మహాసభలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వేల్పుల అర్లప్ప మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర బాధ్యతలు అప్పగించడంతో రైతు సమస్యలపై నిరంతరం కృషి చేస్తానన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల రైతుల పక్షాన నిలబడి పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పొగాకు రైతు ఆత్మహత్యాయత్నం


గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు రామకృష్ణ

నంద్యాల(న్యూటౌన్): పొగాకు కంపెనీల నిర్లక్ష్యం, ప్రభుత్వ అలసత్వం వల్లే పొగాకు రైతు ఆత్మహత్యకు ప్రయత్నించాడని, వెంటనే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా మిడ్తూరు మండలం చౌట్కూరుకు చెందిన పొగాకు రైతు మంగళి రామకృష్ణ (47) గుంటూరు రైల్వే స్టేషన్ సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించి అక్కడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. రామకృష్ణకు గ్రామంలో ఆరెకరాల పొలం ఉండగా ఆంజనేయ స్వామి ఆలయ భూమి 16 ఎకరాలను కౌలుకు తీసుకొని జీపీఐ, అలయన్స్ కంపెనీల ఒప్పందంతో పొగాకు పంటను సాగు చేసినట్లు తెలిపారు. పంట సాగు, పెట్టుబడి, కౌలు చెల్లించేందుకు రూ.30 లక్షల వరకు అప్పులు అయినట్లు చెప్పారు. ఈ స్థితిలో జీపీఐ, అలయన్స్ కంపెనీలు పొగాకును కొనుగోలు చేయకపోవడంతో వర్షాల వల్ల పొగాకు నాణ్యత దెబ్బతింటుందేమోనన్న భయంతో, అప్పులు ఇచ్చిన వాళ్ల ఒత్తిడి చేస్తుండటంతో ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి రైతుల నుంచి పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని, మోసం చేసిన పొగాకు కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బజారున పడిన వ్యవసాయశాఖ పరువు

● కొలిక్కిరాని ఏడీఏల బదిలీలు

కర్నూలు(అగ్రికల్చర్): గతంలో ఎప్పుడూ లేని విధంగా కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ బదిలీల్లో రాజకీయం, పైరవీలు, ముడుపులదే పైచేయి కావడం గమనార్హం. బదిలీల ప్రక్రియ ఈ నెల 9తో ముగిసి.. బ్యాన్ వచ్చినప్పటికీ వ్యవసాయ శాఖలో సహాయ సంచాలకుల(ఏడీఏ) బదిలీల్లో గందరగోళం వీడని పరిస్థితి. ప్రభుత్వ పెద్దలు ఏడీఏల బదిలీల్లో నాన్చుడు దోరణితో వ్యవహరిస్తుండటం వల్లే పైరవీలు కొనసాగుతున్నాయి. దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీల ప్రక్రియ ముగిసిపోయింది. వ్యవసాయ శాఖలో మాత్రమే ఇప్పటికీ ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కారణంగా వ్యవసాయ శాఖలో పరిపాలన స్తంభించింది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ చురుగ్గా నడుస్తోంది. ఒకవైపు విత్తనాల పంపిణీ, మరోవైపు పొలం పిలుస్తోంది.. తదితర అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. బదిలీ కానున్న ఏడీఏలు ఈ కార్యక్రమాల పట్ల అంటీముట్టనట్లుగా ఉన్నారు. వ్యవసాయ శాఖలో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఒక పోస్టులో ఇద్దరు, ముగ్గురిని నియమించడం, జోన్–4చెందిన ఏడీఏను జోన్–3కి బదిలీ చేయడం వంటి తప్పిదాలు భారీగా చోటుచేసుకున్నాయి. బదిలీ కోసం ఎలాంటి ఆప్షన్ ఇవ్వకపోయినప్పటికీ పైరవీలు, ముడుపుల కారణంగా బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 13 మంది ఏడీఏలు బదిలీ అయ్యారు. ఈ నెల 10న బదిలీ ఉత్తర్వులు వెలువడిన తర్వాత పలువురు ఏడీఏలు మార్పులు, చేర్పుల కోసం ప్రభుత్వ పెద్దలను ఆశ్రయించడంతో కొద్ది గంటల్లోనే నిలిపేశారు. దీంతో మళ్లీ రాజకీయ సిఫారసులు, పైరవీలు, ముడుపుల వ్యవహారం ఊపందుకోవడంతో ఏడీఏల బదిలీల వ్యవహారం కొలిక్కిరాని పరిస్థితి. గతంలో ఎప్పుడూ లేని ఈ పరిస్థితి కారణంగా వ్యవసాయ శాఖ అభాసుపాలవుతోంది.


ఖాళీగా దర్శనమిస్తున్న మద్దికెర గ్రామ సచివాలయం - 1

సచివాలయం ఖాళీ !

మద్దికెర: కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ స్థాయిలోనే ప్రజలకు ప్రభుత్వ సేవలందించాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించింది. కార్యకలాపాలు సాఫీగా సాగాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ వస్తోంది. ఈ క్రమంలో స్థానిక ఒకటవ సచివాలయంలోని ఫర్నీచర్ ఇతర కార్యాలయానికి తరలించడంతో ఖాళీగా ఇలా దర్శనమిస్తోంది. కూర్చోవడానికి కుర్చీలు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఎవరూ లేరని వెనుదిరిగిపోతున్నారు. ఇదే సచివాలయంలో ఆధార్ సేవల కేంద్రం నిర్వహిస్తుండడంతో వచ్చిన వారు అవస్థలు పడుతున్నారు. ఒక కార్యాలయంలోని ఫర్నిచర్ మరో కార్యాలయానికి ఎలా తరలిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

డబ్బులెప్పుడు ఇస్తారు సారూ..?



మూసి ఉన్న ఎన్టీఆర్ వైద్యసేవ నగదు ఇచ్చే కౌంటర్

సార్.. మేము రోజూ తిరుగుతున్నాం.. ఆసుపత్రిలో ఇవ్వాల్సిన దానికంటే చార్జీలకే ఎక్కువ ఖర్చయ్యాయి. మాకు డబ్బులు ఎప్పుడు ఇస్తారు సార్. అంటూ ఎన్టీఆర్ వైద్యసేవ కింద చికిత్స పొందిన రోగులు ప్రాధేయపడుతున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎన్టీఆర్ వైద్యసేవ కింద చికిత్స పొందిన రోగులు వైద్య పరీక్షలు, మందుల కోసం పెట్టుకున్న ఖర్చులను డిశ్చార్జ్ అనంతరం అధికారులు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆసుపత్రిలోని పేయింగ్ బ్లాక్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. డిశ్చార్జ్ అయిన రోగులు సంబంధిత బిల్లులు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులను అక్కడ అందజేస్తే ఖర్చు చేసిన మొత్తంలో కొంత తిరిగి ఇస్తారు. అయితే కొన్ని రోజులుగా ఈ కౌంటర్ తెరవడం మానేశారు. దీంతో ఆ కౌంటర్ పక్కనే ఉన్న ఎన్టీఆర్ వైద్యసేవ కార్యాలయంలో వారు డబ్బుల కోసం ఆరా తీస్తున్నారు. సార్ మాకు డబ్బులు ఎప్పుడిస్తారని వారిని అడుగుతుంటే మాకు సంబంధం లేదని, ఆసుపత్రి అధికారులను కలవాలని చెప్పి పంపిస్తున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

పట్టాలు దాటుతుండగా ఢీకొట్టిన రైలు

● పాలిటెక్నిక్ విద్యార్థి దుర్మరణం


మృతుడి ఐడీ కార్డు

ఆదోని సెంట్రల్: ఆదోనిలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో విద్యార్థి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని మదిరె గ్రామానికి చెందిన విశ్వనాథ్, సావిత్రి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నితిన్ బిట్స్ కళాశాలలో పాలిటెక్నిక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం కళాశాలకు బయలుదేరాడు. పట్టణంలోని నల్లగేటు వద్ద కి.మీ. నంబర్ 495/33–31 వద్ద ట్రాకు దాటుతుండగా రైలు ఢీకొని తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.